క్లుప్తంగా

ప్రతి చిన్నారికీ వ్యాక్సిన్ తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి చిన్నారికీ షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్ వేయించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని వడ్డేగేరిలో ఉన్న యూపీహెచ్‌సీని ఆయన సందర్శించారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. డ్యూ లిస్ట్ ప్రకారం ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మళ్లీ వ్యాధి నిరోధక టీకాలు ఎప్పుడు వేయించుకోవాలో ముందుగానే తెలియజేసి ఆ రోజు తప్పనిసరిగా పిల్లలను తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ల్యాబ్, వ్యాక్సినేషన్ స్టోరేజ్ తనిఖీ చేసి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

తక్కువ ధరతో పురుగు మందులు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా నాణ్యమైన పురుగు మందులను తక్కువ ధరతో అందించేందుకు కట్టుబడి ఉన్నామని బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీప్రసాద్ తెలిపారు. బుధవారం కల్లూరు మండలం పెద్దపాడలో కంపెనీ అవసరాల కోసం నూతన వేర్‌హౌస్‌ను ఆయన ప్రారంభించారు. మార్కెట్‌లో ఎన్నో కంపెనీలు ఉన్నా రైతులకు తక్కువ ధరతో నాణ్యమైన ఉత్పత్తులు అందించే కంపెనీ తమదేనని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే వేర్‌హౌస్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. రాయలసీమ మేనేజర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షకు 44 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షకు 88 శాతం హాజరయ్యారు. ఆర్‌యూతో పాటు నందికొట్కూరు, నంద్యాల, ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఆదోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 364 మంది విద్యార్థులకు గాను 320 మంది హాజరయ్యారని.. 44 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేటి నుంచి పది రోజులు తరావి నమాజ్


దారుల్ మజీద్

కర్నూలు (న్యూటౌన్): పవిత్ర రంజాన్ మాసంలో రెండో అషరా ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పది రోజుల పాటు అబ్బాస్‌నగర్ దారుల్ మజీద్‌లో రాత్రి 8.30 గంటలకు తరావి నమాజ్‌లో పాల్గొనాలని జమియత్ ఉల మా జిల్లా అధ్యక్షుడు మౌలానా ఖాజీ అబ్దుల్ మజీద్ సాహెబ్, జిల్లా కార్యదర్శి హాఫీజ్ అబ్దుస్ సమి అసద్ కోరారు. అషరా అంటే రంజాన్ 11వ తేదీ నుంచి 20 వరకు, అలాగే 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి రోజూ తరా వి ప్రార్థనలో ఖురాన్‌లోని 3 పారాలు పఠించడం జరుగుతుందని పేర్కొన్నారు. తరావి నమాజ్‌లో ముస్లింలందరూ పాల్గొని అల్లాహ్ కృపకు పాత్రులుకావాలన్నారు.

నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ మృతికి సంతాపం

కర్నూలు (న్యూటౌన్): ఏపీ నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వర్‌రా వు అకాల మరణానికి చింతిస్తూ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా నాయకులు రమణమూర్తి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.బుధవారం స్థానిక కార్యాలయంలో నాగేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ సంఘానికి, సమాజానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

కర్నూలు కల్చరల్: స్వాతంత్య్ర సమరయోధులు సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 23వ తేదీ జిల్లా వ్యాప్తంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి అన్నారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్‌లో జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువతకు వారి చరిత్రను తెలిపే విధంగా వర్ధంతిని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ బీసన్న, రాజీవ్, రమేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పాణ్యం ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే కుమార్తె కాటసాని మాధవీలత, స్థానిక కార్పొరేటర్ అరుణ పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు అర్బన్ 21వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ రేణుక పాల్గొన్నారు.

నరాలకు నయా వైద్యం

- పెద్దాస్పత్రి న్యూరాలజీ విభాగంలో అత్యాధునిక సేవలు
- ఏటా 17 వేలకు పైగా ఓపీ, 800కుపైగా ఐపీ
- నిత్యం 80 మంది రోగులతో వార్డు కిటకిట!
- ఈఈజీ, ఈఎంజీ పరీక్షలు కూడా ఇక్కడే..
- తాజాగా పది పడకలతో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు
- జీబీఎస్ సిండ్రోమ్ రోగులకు రూ.లక్షన్నర ఇంజెక్షన్లు ఉచితం

ఒకప్పుడు పక్షవాతం, నరాల సమస్య వచ్చిందంటే కార్పొరేట్ వైద్యశాలలను ఆశ్రయించాల్సి వచ్చేది. రూ.లక్షలు ఖర్చు పెట్టి చికిత్స చేయించాల్సిన పరిస్థితి. అయితే రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించింది. దీని ఫలితంగా కర్నూలు సర్వజన ఆస్పత్రి న్యూరాలజీ విభాగంలో ఇప్పుడు మెరుగైన వైద్యంతో పాటు ఖరీదైన ఇంజెక్షన్లు వేస్తున్నారు. అత్యుత్తమ వైద్యులు అందుబాటులో ఉన్నారు. రోగులకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి.


న్యూరాలజీ స్ట్రోక్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న రోగులు


ఫిట్స్ బాధితురాలికి ఈఈజీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): గతంలో పక్షవాతం రోగులను మెడికల్ వార్డులో ఉంచి రోజుల తరబడి చికిత్స చేసేవారు. కానీ ఇప్పుడు ఏకంగా న్యూరాలజీ విభాగంలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. అది కూడా స్ట్రోక్ యూనిట్‌లోని ఐసీయూలో ప్రత్యేక వైద్యం చేస్తున్నారు. ఖరీదైన ఇంజెక్షన్లు వేయడంతో రోగి త్వరగా కోలుకునే అవకాశం లభించింది. ఎలక్ట్రోఎంసెఫలోగ్రామ్ (ఈఈజీ), ఎలక్ట్రోమియోగ్రఫీ (ఈఎంజీ) వంటి పరీక్షలు కూడా ఇక్కడే చేస్తున్నారు. ఒకప్పుడు స్పెషాలిటీ విభాగాలకే పీజీ సీట్లు కరువుగా ఉండేది. ఇప్పుడు సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లోనూ పీజీ సీట్లు మంజూరవుతున్నాయి. న్యూరాలజీ విభాగంలో కూడా పీజీ సీట్లు రావడంతో రోగులకు మరింత మెరుగైన వైద్యం అందుతోంది.

వారంలో రెండు రోజులు ఓపీ

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూరాలజీ విభాగానికి ప్రతి సోమ, గురువారాల్లో ఓపీ చికిత్స అందిస్తారు. గతంలో ఈ విభాగానికి ఒక్కరే వైద్యులుండేవారు. మిగిలిన పోస్టులు మంజూరైనా భర్తీ చేసేవారు కాదు. కానీ ఇప్పుడు అన్ని ఖాళీలు భర్తీ అయ్యాయి. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్ డాక్టర్ సి. శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్యామసుందర్, డాక్టర్ సౌజన్య విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఇటీవల రెండు పీజీ సీట్లు మంజూరు కావడంతో ఇద్దరు యువ వైద్యులు ఇక్కడ చదువుతూ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విభాగంలో ఫిట్స్, స్ట్రోక్, పార్కిన్సన్, ఆప్టిక్ న్యూరైటిస్, న్యూరో మస్కులర్ డిసీజ్, మెడ నొప్పులు, కాళ్లు, పాదాల నొప్పులు, సయాటికా, న్యూరోపతి వంటి అనేక రకాల నరాల జబ్బులకు చికిత్స అందిస్తున్నారు.

10 పడకలతో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు

న్యూరాలజీ విభాగానికి గతంలో స్ట్రోక్ యూనిట్ ఉండేది కాదు. ఇక్కడే కాదు రాష్ట్రంలో చాలా చోట్ల ఈ విభాగమే లేదు. కానీ ఇటీవల స్ట్రోక్ బాధితులు అధికంగా వస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇక్కడ పది పడకలతో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేసింది. ఇందులో ఐసీయూ ఏర్పాటు చేసి వెంటిలేటర్లు, సెక్షన్ ఆపరేటర్లు, ఆక్సిజన్ పైపులైన్, సెంట్రల్ ఏసీ ఏర్పాటు చేయడంతో కార్పొరేట్ ఆస్పత్రులకు మిన్నగా ఇక్కడ స్ట్రోక్ బాధితులకు చికిత్స అందుతోంది. సకాలంలో ఆస్పత్రికి వచ్చే స్ట్రోక్ బాధితులకు రూ.50వేల విలువ గల టీపీఏ(టిష్యూ ప్లాస్మినోజన్ యాక్టివేటర్) ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తున్నారు. అంతేగాక జీబీఎస్ సిండ్రోమ్ ఉన్న బాధితులకు ఖరీదైన ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లను ఒక కోర్సుకు రూ.1.50లక్షలను ఖర్చు చేస్తున్నారు.

ఐదేళ్లుగా ఓపీ, ఐపీ రోగుల సంఖ్య

సంవత్సరం	ఓపీ రోగులు	ఐపీ రోగుల సంఖ్య
2019	13,861	--
2020	10,066	228
2021	13,893	505
2022	17,201	845
2023	17,749	919

రోగులకు సకల వసతులు



న్యూరాలజీ విభాగంలో ప్రస్తుతం రోగులకు అన్ని సౌకర్యాలతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఒకప్పుడు ప్రైవేటుకు వెళ్లే స్ట్రోక్ బాధితులు ఇక్కడి వసతులు, సౌకర్యాలు చూశాక ఇక్కడికే వస్తున్నారు. దీని వల్ల మా విభాగంలో నిత్యం 70 నుంచి 80 మంది రోగులు ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్నారు. ఇక్కడి వైద్యులను నమ్మి వస్తున్న వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. రికవరీ రేటు అధికంగా ఉంటోంది.

–డాక్టర్ సి.శ్రీనివాసులు, న్యూరాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు


గ్రామస్తులకు అభివాదం చేస్తున్న సతీష్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్
- శివరాంపురంలో ఇంటింటి ప్రచారం

కర్నూలు సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని.. కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. బుధవారం కర్నూలు రూరల్ మండలం పరిధిలోని శివరాంపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. కరోనా విపత్కర పరిస్థితులు ఒక వైపు.. ఆర్థిక ఇబ్బందులు మరో వైపు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. పథకాల వల్ల మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వండని చెబుతున్న దమ్మున్న నాయకుడు జగనన్న అని చెప్పారు. తెలుగు దేశం పార్టీతో పాటు మిగిలిన పార్టీల నాయకుల్లా మాట తప్పే నాయకుడు కాదని, చెప్పాడంటే.. ఎంత కష్టమైన చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి, జాతీయ స్థాయిలో పేద పిల్లలు రాణించాలనే ఉద్దేశంతోనే ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారన్నారు. రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో పెట్టుబడికి సహాయం చేసేందుకు రైతు భరోసా రెగ్యులర్‌గా అందిస్తున్నారని, పండించిన పంటను సొంత గ్రామంలోనే విక్రయించుకునేందుకు ఆర్‌బీకే కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి మరోసారి మద్దతు తెలపాలని కోరారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీవై రామయ్యను ఆశీర్వదించాలన్నారు. తమ బతుకులు మార్చిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని స్థానికులు స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహెమియా, మండల మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, బి.శ్రీనివాసులు, సాగర్, ఉప సర్పంచ్ మహాలక్ష్మి, గార్గేయపురం, పసుపుల సొసైటీ చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శేఖర్, నాయకులు చిన్న లక్ష్మన్న, శేఖర్, మోహన్ బాబు, గోపాల్, వెంకటేశ్వరరెడ్డి, హరినాథ్‌రెడ్డి, సురేష్, ఏసేపు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను మళ్లీ తెచ్చుకుందాం

- వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్
- నగరంలో ఇంటింటి ప్రచారం


శ్రీరామనగర్‌లో ఇంతియాజ్‌కు గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కర్నూలు (టౌన్): సంక్షేమ పాలనను అందిస్తున్న జగనన్నను మరోసారి గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని 23వ వార్డు శ్రీరామనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానికంగా చిరు వ్యాపారులను కలిశారు. కాలనీలో ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఇంతియాజ్‌తో పాటు కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై.రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం ఏర్పడిందన్నారు. ఐదేళ్లలో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. అవినీతికి తావు లేకుండా రూ.2.50 లక్షల కోట్లు సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. కలెక్టర్‌గా వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవంతో తనకు అవకాశం ఇస్తే నగర అభివృద్ధితో పాటు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ప్రకాష్‌నగర్‌లో పర్యటించారు. గఫ్ఫారియా మసీదులో ముస్లింలతో కలిసి నమాజ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సచివాలయాల కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేదార్‌నాథ్, కార్పొరేటర్ కటారి పల్లవి, నాయకులు కటారి సురేష్‌కుమార్, రమణ, సీహెచ్ మద్దయ్య, ముస్తాఫా, కిరణ్, జమీలా, మంగమ్మ, ఎస్తేర్ రాణీ తదితరులు పాల్గొన్నారు.

ఇంతియాజ్‌ను గెలిపించుకుందాం

కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌ను గెలిపించుకుందామని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం తన స్వగృహంలో ఇంతియాజ్‌తో కలిసి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి ఇంతియాజ్‌ను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మహబూబ్‌బాషా, ఆదిమోహన్ రెడ్డి, మహేష్, పర్వేజ్, దినేష్‌జైన్, పర్లసూర్యుడు, ప్రభాస్, చాట్ల నవీన్, అక్బర్ అలీ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

కర్నూలు అసెంబ్లీ స్థానానికి సీపీఎం పోటీ

కర్నూలు కల్చరల్: కర్నూలు అసెంబ్లీ స్థానానికి ఉమ్మడి అభ్యర్థిగా సీపీఎం నుంచి పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. ప్రభాకర రెడ్డి, సీపీఐ నేత కె.జగన్నాథం వెల్లడించారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు వామపక్ష పార్టీలు పరస్పర సహకారంతో ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతో కూడా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, కె.రామకృష్ణ, సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

కర్నూలు (లీగల్): ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి రూపాయి ఖర్చు పెట్టకుండా పరిష్కరించుకోవచ్చని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ అన్నారు. బుధవారం సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించిన కేసు వివరాలను ఆయన వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన వి.శ్రీనివాసులు (వాది) ఫిబ్రవరి 7వ తేదీ నందికొట్కూరు డిపో బస్సులో కర్నూలు బస్టాండ్ నుంచి వెంకాయపల్లెకు టిక్కెట్ తీసుకున్నానని, ఎస్ఎస్ గార్డెన్స్ స్టాప్‌లో బస్సును ఆపాలని ప్రతివాదులు అయిన డ్రైవర్, కండక్టర్‌కు విన్నవించగా వారు నిరాకరించి మరో స్టాప్‌లో బస్సును ఆపేయడంతో కాలినడకన ఎస్ఎస్ గార్డెన్‌కు చేరుకునేందుకు ఆలస్యమైందని, తన పనిని సకాలంలో చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడని తెలిపారు. అదాలత్ ఈ విషయాన్ని తెలియజేస్తూ ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బందికి నోటీసులు జారీ చేయగా ప్రతివాదులు అయిన డ్రైవర్, కండక్టర్ బెంచ్ సమక్షంలో పిటిషనర్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పారని తెలిపారు. భవిష్యత్తులో ఇది పునరావృతం కాదని హామీ ఇచ్చారని, పిటిషనర్ దానిని అంగీకరించి ఫిర్యాదును ముగించడానికి ఒప్పుకున్నారని చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ వారు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజుబాబు సమక్షంలో ఇరుపక్షాల మధ్య రాజీ పరిష్కారం జరిగిందని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్‌లో రాజీ అయ్యే కేసులకు అప్పీలు ఉండదని పేర్కొన్నారు.

22న ఓటు హక్కుపై అవగాహన

కర్నూలు (న్యూటౌన్) : ఈనెల 22వ తేదీన ఉదయం 10.30 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ భవనంలో జిల్లాలో ఓటు హక్కు కలిగి వున్న విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు), వయోవృద్ధులు (సీనియర్ సిటిజన్స్), హిజ్రాలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


పాతకల్లూరులో..

కల్లూరులో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన



పాతకల్లూరు ఊరువాకిలిలో ఓ ఇంటికి అతికించిన పోస్టర్, కల్లూరు బాపిస్టు చర్చి ఎదురుగా..

కర్నూలు (న్యూటౌన్): పాత కల్లూరులో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. ఇంటి యజమాని అనుమతి లేకుండా అడ్డగోలుగా, బలవంతంగా 'బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ' పోస్టర్లను అతికించడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. పాతకల్లూరు ఊరు వాకిలి వద్ద, చెంచునగర్, హన్నూర్ షావలి దర్గా, తెలుగు బాపిస్టు చర్చి, అంబేడ్కర్ విగ్రహం సమీపంలో, ఆదర్శ పాఠశాల వద్ద, 126వ రేషన్ షాపు ఎదురుగా పోస్టర్లను అతికించారు. అధికారులెవ్వరూ ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి వైద్యం

కర్నూలు(హాస్పిటల్): రహదారిపై అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తికి ఓ రిటైర్డ్ డీఎస్పీ వైద్యం అందేలా చేయడంతో ప్రాణాలు నిలిచాయి. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రహదారిపై ఓ వ్యక్తి మండు వేసవిలో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని రిటైర్డ్ డీఎస్పీ పాపారావు గమనించారు. అతన్ని కదిలించి చూడగా ఎలాంటి స్పందన లేదు. అతని ఆరోగ్య పరిస్థితిని గమనించి వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వాహనం వచ్చేలోగా అతనిపై నీళ్లు చల్లి సపర్యలు చేశారు. 108 అంబులెన్స్ వచ్చిన తర్వాత సిబ్బంది అతనికి ప్రాథమిక వైద్యం అందించి అంబులెన్స్‌లో వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డున పడి ఉన్న వ్యక్తిని మనకెందుకులే అని వెళ్లకుండా స్పందించి వైద్యం అందేలా చేసిన రిటైర్డ్ డీఎస్పీ పాపారావు చర్యలను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఓర్వకల్లు: కర్నూలు– కడప జాతీయ రహదారిపై ఓర్వకల్లు మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. కర్నూలు ఉంచి నంద్యాల వైపు వెళ్తున్న అప్పి ఆటోను వెనుక నంచి అతివేగంగా వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో ఒక్కసారిగా ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన గల గుంతలో పల్టీలు కొట్టి పడింది. దీంతో ఆటో డ్రైవర్ రాజుతో పాటు, అందులోని ప్రయాణికులను హుసేనాపురానికి చెందిన రామప్ప, గంగమ్మ దంపతులు, కేశమ్మ, కాల్వ వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామన్న తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే స్వగృహానికి మంత్రి పెద్దిరెడ్డి


మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం పలుకుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేము సిద్ధం బస్సుయాత్రకు సంబంధించి ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి బుధవారం కర్నూలు విచ్చేశారు. ముందుగా వారు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహానికి వచ్చారు. వారికి ఎమ్మెల్యే పుష్ప గుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు.

సంక్షేమ సారథితో పేదరిక నిర్మూలన


సంక్షేమ పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ సాంబశివరావు

కర్నూలుసిటీ: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి సీఎంగా చేసుకుంటేనే పూర్తి స్థాయిలో పేదరిక నిర్మూలన సాధ్య మని 39వ వార్డు కార్పొరేట్ సీహెచ్ సాంబశివరావు అన్నారు. బుధవారం కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 39వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జేసీఎస్ కన్వీనర్ జగన్ యాదవ్, కిరణ్‌కుమార్, కోటేశ్వరరావు, యాగంటి, ఇర్షాద్, నారాయణ పాల్గొన్నారు.